శృంగారగాధాలహరి

# వాసంతిక

ప్రతిప్రస్థాన కలశ ముఖనిహితః ప్రథమ మంజరీ సహితః
నవ చూత పల్లవోయం హర్తా గమనం ప్రియస్య మారోదీః

**భావం:** చివుళ్ళతో ఉన్న కొత్త మామిడి పూగుత్తిని ప్రస్థాన కలశ ముఖంలో ఉంచాను. ఆ కలశమే నీ ప్రియభర్త ప్రయాణాన్ని ఆపుతుంది. దుఃఖించకు.

మంజువాణీ, వసుమంతులది అనురాగమైన దాంపత్యం. మంజువాణి భర్తను వదలి క్షణమైనా ఉండలేదు. వసుమంతునికి అన్ని దేశాలూ పర్యటించి రాజుల వద్ద తన విద్యను ప్రదర్శించి ధనాన్నీ కీర్తినీ సంపాదించాలన్న కోరిక కలిగింది. మంజువాణిని పుట్టింట్లో వదిలి, ప్రయాణం కావాలనుకున్నాడు. భార్యతో సహా అత్తవారింటికి వచ్చాడు. అత్తవారి ఊళ్ళోని జ్యోతిష్కుడు అతని దేశపర్యాటనకు ముహూర్తం నిర్ణయించాడు. ముహూర్తం ముందురోజు వరకూ మంజువాణీ, వసుమంతులు ఆనందంగానే గడిపేరు.

భర్త ప్రయాణం మర్నాడు అనగా మంజువాణి మనస్సులో గుబులు బయల్దేరింది. ఆరాత్రి భర్త పక్కన పడుకుని "ప్రయాణం తప్పదా?" అని అడిగింది. వసుమంతుడు ఆమెను దగ్గరగా తీసుకుని "ఎంతకాలం ఆరు నెలలేగా? నీ భర్తకు కీర్తీ, డబ్బూ లభిస్తే నీకు మాత్రం గొప్పకాదా?" అన్నాడు.

మంజువాణికి భర్త మీద కోపం వచ్చింది. ఆరు నెలలంటే ఆరు క్షణాలు అన్నట్లుగా మాట్లాడుతున్నాడీయన అనుకుంది. ఆ రాత్రి ఆమెకు నిద్రపట్ట లేదు. భర్త గాఢపరిష్వంగాలూ, దీర్ఘచుంబనాలూ తిరిగి ఎప్పుడో కదా అని ఆలోచిస్తూ పడుకుంది.

తల్లీ, కూతుళ్ళ అనుబంధం గాఢమైనది. తెల్లవారగానే ఎర్రబడ్డ కళ్ళతో కనబడ్డ మంజువాణిని చూడగానే ఆమె తల్లికి పరిస్థితి అర్ధమైంది. భర్త దూరదేశాలకు వెడుతున్నాడన్న దుఃఖంతోనే కూతురు నిద్రపోలేదని ఆమె తెలుసుకుంది. అల్లుడి ప్రయాణం ఆపడం ఎలా అని ఆలోచించింది.

ప్రయాణం చేసేవారికి శకునం కోసం గుమ్మం ముందు కలశం ఉంచడం ఆనవాయితీగా ఉండేది. మంజువాణి తల్లి కలశం పైభాగంలో చివుళ్ళూ కొత్తగా పూసిన పూలూ ఉన్న మామిడి గుత్తిని ఉంచి కలశాన్ని గుమ్మంలో పెట్టింది. కూతురి దగ్గరకు వచ్చి "కొత్త పువ్వులూ, చివు

పాలంకి.యస్

ళ్ళూ ఉన్న మామిడి గుత్తిని ఉంచాను అదే నీ భర్త ప్రయాణాన్ని ఆపుతుంది. ఏడవకు" అంది.

ఆమె ఊహ తప్పు కాలేదు. వసుమంతుడు ప్రయాణమవుతూ గుమ్మంలో ఉన్న కలశాన్ని చూశాడు. అందులో ఉన్న మామిడి చివుళ్ళూ, పూలూ అతన్ని ఆకర్షించాయి. మామిడిపూత ప్రారంభమైందంటూ వసంతం వచ్చిందన్న మాట. వసంతకాలం అతనికి ఉల్లాసాలను జ్ఞాపకం చేసింది. ఈ మల్లెల వేళలో మంజువాణి కౌగిలిలో కరిగిపోవడం కన్నా ధనార్జనా, కీర్తి ముఖ్యం కాదనుకున్నాడు. ప్రయాణం మానుకున్నాడు.

భర్త ప్రయాణాన్ని చాతుర్యంతో ఆపిన తల్లి ఒడిలో పసిపాపలా తల పెట్టుకుని హాయిగా నవ్వింది మంజువాణి

